క్లుప్తంగా

నేడు పర్చూరులో మెగా జాబ్ మేళా

పర్చూరు (చినగంజాం): పర్చూరులోని బీపీఆర్ జూనియర్ కళాశాలలో మంగళవారం ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శేషు కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం వారి సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఈమేళాలో గోదావరి కో ఆపరేటివ్ సొసైటీ, కృష్ణపట్నం పోర్ట్, రాయల్ మెరైన్, రిలయన్స్ ట్రెండ్స్, కళ్లం టెక్స్‌టైల్స్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఈ సంస్థల్లో 120 కి పైగా ఖాళీలు ఉన్నాయని విద్యార్హతలు, నైపుణ్యాన్ని బట్టి జీతం నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈమేళాకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, బీఎస్‌సీ (కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ, పీజీ చదివిన వారు అర్హులు అని తెలిపారు. వయసు 18 నుంచి 35 సంవత్సరాలు మధ్య ఉండాలన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు తమ పూర్తి బయోడేటా, సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 63027 64962, 79814 43777 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముత్యాలపేటలో అన్న సంతర్పణ



భక్తులతో పూజలందుకుంటున్న గణనాథుడు

చీరాల రూరల్: స్థానిక ముత్యాలపేటలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు నిర్వాహకులు తృప్తిగా భోజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వినాయకుని చేతిలోని లడ్డును వేలం పాట నిర్వహించారు. వేలంలో ఓ భక్తుడు రూ. 25,000 పాడుకున్నారు.

నేడు కూరగాయల మార్కెట్‌కు సెలవు

మార్టూరు: మార్టూరు జాతీయ రహదారి పక్కన గల విఘ్నేశ్వర కూరగాయల మార్కెట్‌కు నేడు మంగళవారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపల్లి సాంబశివరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. వర్తక సంఘం ఆధ్వర్యంలో మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా నేడు కూరగాయల మార్కెట్‌కు సెలవు ప్రకటించామని, రైతులు కూరగాయలు మార్కెట్‌కు తీసుకురావద్దని బుధవారం తీసుకురావాలని ఆయన తెలిపారు.


వైద్యశాలకు మెటీరియల్ బహూకరణ



మెటీరియల్‌ను వైద్యాధికారులకు అందజేస్తున్న దాతలు

చినగంజాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్యచికిత్సలు అందించేందుకు అవసరమైన మెటీరియల్‌ను దాతలు అందించారు. చినగంజాంకు చెందిన ముచ్చర్ల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన సతీమణి యశోదమ్మ, కుమార్తె వెంకట సంధ్యారాణి, అల్లుడు నూనె సుబ్రహ్మణ్యంలు సోమవారం వైద్యాధికారులు డాక్టర్ ఎస్ విజయ భాస్కర్, డాక్టర్ పీ సాయి శ్రీచరణ్‌లకు స్వయంగా అందజేశారు. ఆస్పత్రిలో గాయాలైన వారికి కట్లు కట్టుటకు అవసరమైన స్టెరిలైజేషన్ బట్టలు, కుట్లు వేయుటకు ఉపయోగించే పరికరాలను బహూకరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చిరంజీవి, మురళి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనంలో అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: వినాయక నిమజ్జనం సమయంలో ఎటువంటి అపశ్రుతి జరకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం పొట్టిసుబ్బయ్యపాలెం సముద్రతీరం వద్ద వినయాక నిమజ్జనంపై సిబ్బందిని అప్రమత్తం చేశారు. సముద్రతీరం వద్ద పోలీసులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం పూర్తి చేసుకున్న భక్తులు వెంటనే తిరిగి వెళ్లిపోవాలని సూచించారు. సముద్రంలో స్నానాలు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని తెలిపారు. ఇద్దరు గజ ఈతగాళ్లలను సముద్ర తీరం వద్ద ఉంచినట్లు చెప్పారు.

వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్య

- గణపతి బప్పా మోరియా..
- తీరంలో నిమజ్జనాల సందడే సందడి
- ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్న మెరైన్, సివిల్ పోలీసులు
- కేరింతలు కొట్టిన యువత, చిన్నారులు



ఈపురుపాలెంలో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య



సముద్రంలో నిమజ్జనానికి గణనాథుడుని తీసుకువెళ్తున్న భక్తులు



నిమజ్జనానికి ఆటోలో తరలుతున్న బాలగణేషుడు



చినగంజాం సముద్రతీరంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

చీరాల టౌన్: వినాయకచవితి పండుగ సందర్భంగా చలువ పందిళ్లల్లో ఏర్పాటు చేసిన గణనాథులు నిమజ్జనాలకు తరలివెళ్తున్నారు. ప్రత్యేక పూజల అనంతరం మూడోరోజు సోమవారం మండలంలోని పలు గ్రామాల్లోని వీధుల్లో నెలకొల్పిన పందిళ్లలోని గణనాథులను డీజే పాటల హోరు, యువకుల నృత్యాలు, గులాములు చల్లుకుంటూ ఊరేగింపుల అనంతరం నిమజ్జనం కోసం వాడరేవు సముద్ర తీరానికి తీసుకువస్తున్నారు. అలానే చీరాల నియోజకవర్గంతో పాటుగా పర్చూరు, అద్దంకి, చిలకలూరిపేట, నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను తప్పెట్ల ఊరేగింపుల అనంతరం గంగఒడిలోకి వాడరేవు తీసుకువచ్చి నిమజ్జనం చేస్తున్నారు. వాడరేవులో నిమజ్జనాల సందడి నేపథ్యంలో చీరాల రూరల్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తూ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు. భక్తులు సముద్రంలో లోతుకు వెళ్లకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

పర్చూరు (చినగంజాం): మండలంలోని ఉప్పుటూరు శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సోమవారం లడ్డు వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు లడ్డు వేలం పాటలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించి వాడరేవుకు నిమజ్జనానికి తరలించారు. శివాలయం యూత్ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కారంచేటి పిచ్చయ్య శాస్త్రి, మూలంరాజు కుమార స్వామి, నూతలపాటి సుబ్రహ్మణ్యం భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్నహస్తాలు



హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో అందచేసేందుకు సిద్ధం చేసిన నిత్యావసరాలు



చీరాల నుంచి విజయవాడకు తరలిస్తున్న నిత్యావసర సరుకులు

జే.పంగులూరు: విజయవాడ వరద ముంపు బాధితుల నిమిత్తం దాతలు తమకు తోచిన సాయాన్ని అందిస్తూ మేమున్నామంటూ ధైర్యాన్ని నింపుతున్నారు. పంగులూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించినట్లు విరాళాల సేకరణ సమన్వయ కర్త తాళ్లూరి రామాంజినేయులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి పంగులూరు గ్రామంలో బొడ్డురాయి సెంటర్ నుంచి ప్రారంభించి చిన్నమల్లవరం రోడ్డు, వేణుగోపాలస్వామి గుడి వద్ద నుంచి ఇంకొల్లు వెళ్లే రోడ్డు చివరి వరకు ఉన్న ఇళ్ల వద్ద దాతల నుంచి రూ. 35 వేలు ఎకరించనట్లు తెలిపారు. తమ వంతుగా ఒక రూ.1 లక్ష వరకు సేకరించే ఆలోచనలో ఉన్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో బాచిన శ్రీనివాసరావు, వడ్డేపూడి హనుమంతురావు, పఠాన్ అబ్దుల్ రఫీ, చిలుకూరి మాధవి, బాచిన కృష్ణ తెలిపారు.

వరద బాధితులకు సాయం..

అద్దంకి: విజాయవాడ వరద బాధితులకు మానవతా దృక్పథంతో సాయం అందిస్తున్నారు. దానిలో భాగంగా సోమవారం పట్టణానికి చెందిన రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ తాళ్లూరి బాబూరావు రూ.15 వేల సాయాన్ని సీపీఎం మండల పార్టీ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లుకు అందజేశారు.

మేదరమెట్ల: వరదలకు ముంపు ప్రాంతాల్లోని లంక గ్రామాల వరద బాధితులకు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావర సరుకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా హెల్ప్ సంస్థ టీవీబీవీ సాగర్ మాట్లాడుతూ బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వరద ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి తమ వంతు సాయంగా వారికి ఆత్మస్థైర్యంతో పాటు నిత్యావసరాలైన కూరగాయలు, రొట్టెలు, నిత్యావరస సరుకులు, వృద్ధులకు, గర్భిణులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. పూర్తిగా నిరాశ్రయలైన అన్నవరపు లంక గ్రామస్తులకు నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

చీరాల నుంచి విజయవాడకు నిత్యావసర సరుకులు..



పంగులూరులో వరద బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్న దాతలు

చీరాల అర్బన్: వరద బాధితుల సహాయార్థం చీరాల కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1000 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను సోమవారం ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు తరలించారు. వరద బాధితులకు ఆదుకునేందుకు వారికి తమ వంతుగా సహాయం చేసేందుకు కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ తరుపున సరుకులను పంపినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

విజయవాడ విలయానికి చంద్రబాబే కారణం

- వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి



పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి: వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. నిపుణులు హెచ్చరికలు జారీ చేసినా పట్టించుకోకపోవడం వల్లే వరదల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. కనీసం వరద ప్రాంతాల్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో నివశించే వారిని కూడా సురక్షిత ప్రాంతాలకు ముందుగా చేర్చలేని పరిస్థితిని ఇప్పుడే చూస్తున్నాం. చేతుల కాలాక ఆకులు పట్టుకున్న చందంగా తయారైంది ప్రభుత్వ చర్య. ఇదంతా సీఎం చంద్రబాబునాయుడు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ ప్లాంటు మునగకుండా బుడమేరు వాగులను విజయవాడ నగరంలోకి మళ్లించారు. ప్రజలు తమకు తాము సురక్షిత ప్రాంతాలకు చేరితే వారికి ఆహారం అందించడానికి ఈ ప్రభుత్వానికి చేతకాలేదు. అధికారులను వెంటనేసుకుని తిరగడం మినహా చేసింది ఏమీ లేదు. రాష్ట్ర రాజధానిగా చెప్పుకునే అమరావతి, విజయవాడ ప్రాంతం విజయవాడలోనే నెలకొన్నదంటే ఇక ప్రభుత్వ అప్రమత్తత ఎలా ఉందో చెప్పవచ్చు. అక్కడి స్థానిక ప్రజాప్రతినిధులు సైతం వరద బాధితులను ఆదుకోవడంలో దారుణంగా విఫలమయ్యారన్నారు. కేవలం నీళ్లు తక్కువగా ఉన్న చోటనే ఆహారం పంపిణీ చేసి మమ అనిపిస్తున్నారని, లోతట్టు ప్రాంతాలు, వీధి చివరి బాధితులకు అందించడంలో విఫలమయ్యారని చెప్పారు. కేవలం హంగు, ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇచ్చారే తప్పా బాధితులను పట్టించుకో లేదని విమర్శించారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రెస్‌మీట్‌లతో సరిపెట్టకుండా బాధితులకు పూర్తి సాయం అందించాలి.

పారాలింపిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ హర్షణీయం



వృద్ధులకు స్వీట్లు పంచుతున్న దివ్యాంగులు

చినగంజాం: ప్యారిస్‌లో నిర్వహించిన 17వ పారాలింపిక్ గేమ్స్‌లో భారతీయ క్రీడాకారులు పతకాలు సాధించడం పట్ల మండలంలోని దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగుడు భారత్ నిర్మాణ్ వలంటీర్ ఏళుమలై గోవిందస్వామి ఆధ్వర్యంలో స్థానిక వృద్ధుల ఆశ్రమం లో దివ్యాంగులకు, వృద్ధులకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు మునుపెన్నడు లేని విధంగా 7 బంగారు పతకాలు, 9 వెండి పతకాలు, 13 కాంస్య పతకాలు మొత్తం 29 పతకాలు సాధించి పతక సాధనలో 18 వస్థానం దక్కించుకున్నారని అన్నారు. విశేషంగా మరియప్పన్ తంగవేలు వరుసగా 2016, 2020, 2024లో 3 సార్లు పతకాలు సాధించి హ్యాట్రిక్ సాధించారని ఈ సందర్భంగా మండలంలోని దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఊటుకూరి రవీంద్రనాథ్ గుప్త, ఆర్ రామారావు, ఎం వెంకటేశ్వర్లు, జీ కవచమ్మ, సీఎచ్ సుబ్బరావమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

కన్నుల పండువగా గణపతి హోమం



కొత్తపాలెంలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు



ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి హోమం



కారంచేడు: అలంకరణలో వినాయకుడు

కారంచేడు: గణపతి నవరాత్రులలో భాగంగ మండల కేంద్రం కారంచేడు మాస్కో బజారు వద్ద ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి పందిరిలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాధవస్వామి దేవాలయ అర్చకులు వేదాంతం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలోని వేద పండితులు పెద్ద ఎత్తున గణపతి హోమం నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతుల అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన హోమ గుండం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

చినగంజాం: వినాయక చవితి పండుగ మూడో రోజు మండలంలోని కొత్తపాలెం గ్రామంలో వినాయక విగ్రహం వద్ద సోమవారం ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి నిమజ్జనానికి పల్లెపాలెం సముద్రతీరానికి ఊరేగింపుగా తరలించారు. కార్యక్రమంలో కొత్తపాలెం గ్రామ కాపులు గాలి పెద్దపోలిరెడ్డి, బక్కా రమణారెడ్డి, బొడ్డు శ్రీనివాసులు రెడ్డి, గాలి సుబ్బారెడ్డి, రామాలయం గుడి పూజారి, పోలేరమ్మ గుడి పూజారి రాజు రామచంద్రారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


గోశాలకు తవుడు, దాణా అందజేత



దాణా అందజేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక హరిహర గోశాలలోని గోవులకు రూ. 10 వేల విలువ చేసే తవుడు, దాణాను అందజేశారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ వ్యయ ప్రయాసల కోర్చి గోశాల నిర్వహిస్తున్న గోనుగుంట సుబ్బారావును అభినందించారు. కార్యక్రమంలో యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, మాలది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, జీ. సుబ్రమణ్యం, ఏ శ్రీనివాసరావు, నాగసూరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మినుములో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



మినుము పంటను పరిశీలించిన ఏఓ సుబ్బారెడ్డి

జే.పంగులూరు: మినుములో సస్యరక్షణ చర్యలు తప్పనసరిగా పాటించాలని ఏవో కే సుబ్బారెడ్డి అన్నాడు. మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలో సోమవారం మినుము పంటను ఏఓ సుబ్బారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మినుము పైరు మండలంలో 30 నుంచి 65 రోజుల దశలో ఉందన్నారు. ఈదశలో అక్కడక్కడ రసం పీల్చే పురుగులు తెల్లదోమ ఆశించి ఆకులు పసుపు రంగులో మారుతున్నాయన్నారు. వీటి నివారణకు క్రిమి వాహకమైన తెల్లదోమ నివారణకు అజాడిరాక్టిన్ 0.03 డబ్ల్యూఎస్పీ 5 గ్రాములు లేదా మిథైల్ డెమాటాన్ 25 ఈసీ 1.6 ఎంఎల్ లేదా థయామిథాక్సామ్ 25 డబ్ల్యూజీ రెండు గ్రామలు పిచికారీ చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన సమాజం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శిరీష

మార్టూరు: గర్భిణులు, ప్రాథమిక దశ నుంచి పిల్లలు, బాల బాలికలకు సమతుల పౌష్టికాహారం అందించడం ద్వారా మెరుగైన సమాజ నిర్మాణానికి దోహదపడగలమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ శిరీష అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని ఇసుక దర్శి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సమతుల ఆహారం గురించి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు పి. రమాదేవి, తస్నీరు రమాదేవి, మాధవి లత, ఆయాలు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి నిబంధనలు పాటించాలి

పర్చూరు (చినగంజాం): గణేష్ నిమజ్జనానికి విగ్రహ కమిటీ సభ్యులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు అన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిత్యం తనిఖీ చేస్తూ ఉండాలని పోలీస్ సిబ్బందిని ఆదేశిస్తూ వారికి పలు సూచనలు అందజేశారు. సోమవారం జాగర్లమూడి గ్రామానికి సంబంధించి నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణలో బాగంగా పర్చూరు వచ్చినట్లు ఆయన తెలిపారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

ఈ-క్రాప్ నమోదుకు 15వ తేదీ ఆఖరు



ఈ-పంట నమోదు పరిశీలిస్తున్న ఏవో కుమారి

బల్లికురవ: ఈనెల 15లోపు ఈ-క్రాప్ చేసుకోవాలని బల్లికురవ మండల వ్యవసాయాధికారిణి కుమారి అన్నారు. సోమవారం మండలంలోని కొణిదెన గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ నెల 15తో ఖరీఫ్‌పంట నమోదు ముగుస్తుందని వరి, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలే కాకుండా రైతులు సాగుచేసిన అన్న పంటలు అరటి, చెరకు, కూరగాయాలు, సుబాబుల్, యూకలిప్టస్, పశుగ్రాసం మొదలైన అన్ని పంటలు పంట నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా ఉపయోగాలు ఉన్నాయన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

మేదరమెట్ల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో అపరిశుభ్రత చోటు చేసుకుందని దీనిపై పంచాయతీ కార్యదర్శులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సురేష్‌బాబు సూచించారు. మండలకేంద్రమైన కొరిశపాడు ఎస్సీ కాలనీలలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తప్పనిసరిగా వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన తెలిపారు.

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. సోమవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యురాలు శ్రీదేవి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని 14 సబ్ సెంటర్లలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.